క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో హనుమత్‌వ్రత పూజలు



అమరావతి: హనుమత్ వ్రతాన్ని పురస్కరించుకుని శుక్రవారం ప్రసిద్ధ శైవక్షేత్రం అమరావతి అమరేశ్వరాలయంలోని ప్రసన్నాంజనేయస్వామికి శుక్రవారం తమల పాకుల పూజ, హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. వడ మాలలు స్వామికి సమర్పించుకున్నారు. ఆలయ అర్చకుడు పరుచూరి కేశవచార్యులు స్వామివారికి పంచామృత స్నపన, సహస్ర నామాలతో ఆకు పూజలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులకు పాల్గొని, ప్రసాదాలను స్వీకరించారు.

వైభవంగా వ్రత మహోత్సవం




బెల్లంకొండ: మండలంలోని బెల్లంకొండ క్రాస్ రోడ్డు వద్ద గల కోళ్లూరు ప్రసన్నాంజనేయ స్వామి ఆలయంలో శుక్రవారం హనుమత్ వ్రత మహోత్సవ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. మార్గశిర శుద్ధ త్రయోదశి సందర్భంగా ఏటా స్వామివారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహిస్తారు. వ్రత మహోత్సవాల సందర్భంగా దేవదాయ శాఖ అధికారులు విద్యుత్ దీపాలతో ఆలయాన్ని సుందరంగా అలంకరించారు. కార్తీక మాసంలో స్వామివారి దీక్షలను చేపట్టిన మాలధారులు మండల కాలం దీక్ష చేసి స్వామివారికి ఇరుముడులను సమర్పించారు. ఆలయ ప్రధాన అర్చకులు నరసింహ చార్యులు, అనంతాచార్యులు పూజల అనంతరం అభిషేక కార్యక్రమాల నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవదాయ శాఖ ఈవో అవుదూరి వెంకటేశ్వర రెడ్డి, పాలక వర్గ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

మండల స్థాయి అధికారులకు శిక్షణ



సత్తెనపల్లి(ముప్పాళ్ళ): ఏపీఎస్ ఐఆర్‌డీ ఆధ్వర్యంలో మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ సర్పంచ్‌లకు, పంచాయతీ కార్యదర్శులకు, వివిధ శాఖల మండల స్థాయి అధికారులకు శుక్రవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సత్తెనపల్లి డీఎల్‌డీఓ రాజగోపాల్ పాల్గొని ఎల్‌ఎస్‌డీజీ ప్రాధాన్యత, వివిధ స్థాయిలో సిబ్బంది అమలు చేయాల్సిన విధానంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో బి.శ్రీనివాసరెడ్డి, ఈఓపీఆర్డీ ఎ.శ్రీనివాసరెడ్డి, ఆయా శాఖల అధికారులు, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

సిమెంటు బల్లలు బహూకరణ



పెదకూరపాడు: పెద్దకూరపాడు గ్రామానికి టీడీపీ జిల్లా కార్యదర్శి ఆర్తి మల్ల రమేష్ శుక్రవారం సిమెంట్ బల్లలు అందజేశారు. సెయింట్ ఆన్స్ పాఠశాల, సామాజిక ఆరోగ్య కేంద్రం, జెండా చెట్టు బజారు, స్థానిక టీడీపీ కార్యాలయం వద్ద వీటిని ఏర్పాటు చేయనున్నారు. ఇందుకు రూ.20 వేలు వెచ్చించారు. పలువురు ఆయనను అభినందించారు.


ముగిసిన పంచాయతీ శిక్షణ తరగతులు



క్రోసూరు: పంచాయతీల సుస్థిర అభివృద్ధిపై మండలంలోని అన్ని శాఖల అధికారులకు గత రెండు రోజులుగా నిర్వహించిన శిక్షణ తరగతులు శుక్రవారం ముగిసినట్లు ఎంపీడీవో జి.శ్రీనివాస్ తెలిపారు. ఈ కార్యక్రమానికి స్టేట్ అబ్జర్వర్ మోహన్‌రావు పాల్గొని, పంచాయతీల అభివృద్ధికి ప్రతి అధికారి పట్టుదలగా పనిచేయాలన్నారు. రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్ నిధుల వినియోగంపై అవగాహన కల్పించారు. వనరుల వినియోగం, భవిష్యత్తు తరాల అవసరాలకు తగిన విధంగా మెరుగుపరచడం స్థానిక సంస్థల ప్రజాప్రతినిధుల, అధికారుల బాధ్యతన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కార్యాలయ సూపరింటెండెంట్ రాధారమణ, పంచాయతీ కార్యదర్శులు, ఆరోగ్య శాఖ, వెలుగు, ఉపాధి, ఐసీడీఎస్ అధికారులు, పాల్గొన్నారు.ఈ సందర్భంగా స్టేట్ అబ్జర్వర్‌ను ఘనంగా సత్కరించారు.

స్మార్ట్‌గా కరెంట్ షాక్..!

- నర్దు బాటు చార్జీలతో ఇప్పటికే పెరిగిన విద్యుత్ బిల్లులు
- మరో బాదుడుకు ఆయుధంగా స్మార్ట్ మీటర్లు
- ప్రభుత్వ కార్యాలయాలతో మొదలు.. గృహాలతో పూర్తి
- సెల్ ఫోన్ రీచార్జి తరహాలోనే.. విద్యుత్ మీటర్ల రీచార్జ్..
- ఒక స్మార్ట్ మీటరు ధర రూ.8,500..
- ఈ భారం కూడా వినియోగదారుడి పైనే..?
- ఎన్నికల ముందు చార్జీలు పెంచమని 'కూటమి' తియ్యటి మాటలు
- మధ్యతరగతికి తప్పని చేదు అనుభవాలు



అచ్చంపేట: కూటమి ప్రభుత్వం సామాన్యులకు 'విద్యుత్' షాక్‌లు ఇస్తోంది. విద్యుత్ చార్జీలు పెంచమని ఎన్నికల ముందు కమ్మటి హామీలు గుప్పించిన కూటమి ప్రభుత్వం ఇప్పటికే సుమారు 3 నుంచి 5 శాతం వరకు చార్జీలు పెంచుతూ నిర్ణయం తీసుకుంది. ఇప్పుడు స్మార్ట్ మీటర్లను ఆయుధంగా ఎంచుకుంది. రానున్న కాలంలో రీచార్జ్ చేసుకుంటేనే ఈ మీటర్లు పనిచేస్తాయి. రీచార్జ్ చేసుకోవడం ఒక్కరోజు ఆలస్యమైనా.. విద్యుత్ సరఫరా ఆగిపోతుంది.

ఇకపై విద్యుత్ ఉద్యోగి ఇంటికొచ్చి రీడింగ్ తీసుకునే విధానం ఉండదు. విద్యుత్ కార్యాలయం నుంచే ఎవరు ఎన్ని యూనిట్లు వాడుకున్నారో స్మార్ట్ మీటర్ల ద్వారా తెలిసిపోతుంది. ఫోన్ రీచార్జ్ కోసం ఆన్‌లైన్‌లో బ్యాలెన్స్ వేసుకున్నట్లే.. విద్యుత్ యాప్ ద్వారా వినియోగదారులు ముందుగానే బ్యాలెన్స్ వేసుకోవాలి. ఆ బ్యాలెన్స్ అయిపోవడానికి రెండుమూడు రోజులు ముందు వినియోగదారుని ఫోన్‌కు వార్నింగ్ మెస్సేజెస్ వస్తాయి. ఈ లోపు బ్యాలెన్స్ వేసుకుంటే సరే.. లేకుంటే సరఫరా ఆగిపోతుంది.

వినియోగదారులపై స్మార్ట్ మీటర్ల భారం

ప్రస్తుతానికి అచ్చంపేట మండలానికి 2000కు పైగా స్మార్ట్ మీటర్లు వచ్చాయి. ఇది ఒక్కొక్కటి రూ.8,500 అని సంబంధిత శాఖాధికారులే చెబుతున్నారు. మరి ఈ ఖర్చు ఎవరు భరిస్తారన్న విషయంపై ఇంత వరకు ప్రభుత్వం నుంచి క్లారిటీ లేదు. ఈ సందేహానికి తావివ్వకుండా... ఖచ్చితంగా తమ పైనే ఆ భారం పడుతుందన్న అభిప్రాయానికి ఇప్పటికే వినియోగదారులు వచ్చేశారు. బిల్లుతో పాటే స్మార్ట్ మీటరు వ్యయాన్ని వాయిదాల పద్ధతిలో చెల్లించాల్సి ఉంటుందనుకుంటున్నారు.

పెదకూరపాడు నియోజకవర్గంలో....

నియోజకవర్గంలోని అమరావతి, అచ్చంపేట, పెదకూరపాడు, క్రోసూరు, బెల్లంకొండ మండలాల్లో సుమారు లక్షకు పైగా విద్యుత్ స్మార్ట్ మీటర్లు బిగించే ప్రక్రియ ప్రారంభమైంది. ఇందులో ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, పీహెచ్‌సీలు, బ్యాంకులు, సహకార సంఘాలు సుమారుగా రెండు వేలు ఉంటాయి. కేటగిరి–2 కిందకు వచ్చే వ్యాపార సంస్థలు, చిన్న తరహా పరిశ్రమలు, రైస్ మిల్లులు, సినిమా హాల్స్ వగైలు సుమారుగా 8000లకు పైగా ఉంటాయి. ఇక విద్యుత్ వినియోగదారులు 80 వేలకు పైనే ఉండొచ్చని అంచనా. ఒక్క అచ్చంపేట మండలంలోని ప్రభుత్వ సంస్థలు, వాణిజ్య బ్యాంకులు 385, వ్యాపార సంస్థలు 1,446, గృహ వినియోగదారులు 15,339 మంది ఉన్నారు.

ప్రభుత్వ కార్యాలయాలతో ఆరంభం

ఇప్పటి వరకు ఉన్న విద్యుత్ మీటర్ల స్థానంలో నూతనంగా అదాని వారి స్మార్ట్ మీటర్ల ఏర్పాటు కార్యక్రమాన్ని విద్యుత్ అధికారులు ప్రభుత్వ కార్యాలయాలతో మొదలుపెట్టారు. అలాగే కేటగిరి–2 కింద వచ్చే వ్యాపార సంస్థల్లో ఏర్పాటు చేస్తున్నారు. చివరిగా గృహాలకు స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేస్తారు. దాదాపు అన్ని వర్గాలపై ఈ బాదుడు భారం పడనుంది. ఈ మీటర్లు ప్రస్తుతం ఉన్న మీటర్ల కంటే యమ స్పీడ్.. ఏసీలు, గ్లీజర్స్ ఉన్నవాళ్లు ఇప్పటి నుంచే జాగ్రత్త పడాల్సి ఉంటుంది.



పంచాయతీ కార్యాలయంలో స్మార్ట్ మీటర్ బిగిస్తున్న విద్యుత్ సిబ్బంది

ఇది సుమారు ఆరు నెలల ప్రక్రియ

స్మార్ట్ మీటర్ల ఏర్పాటు ఆరునెలల ప్రక్రియ. ప్రస్తుతానికి ప్రభుత్వ కార్యాలయాలన్నింటికీ పాతమీటర్లు తిసేసి, స్మార్ట్ మీటర్లను బిగిస్తున్నాం. అచ్చంపేట మండలంలో ఇప్పటికి 200కు పైగా మీటర్లు బిగించాం. ఇవి అయిపోగానే వ్యాపార సంస్థలన్నింటికి అమర్చడం జరుగుతుంది. చివరగా గృహాలకు అమర్చే విధంగా ఉత్తర్వులు వచ్చాయి. ఇకపై రీడింగ్ తీసే ప్రక్రియ ఉండదు. విద్యుత్ కార్యాలయం నుంచే ఎవరు, ఎంత వాడుకున్నది రీడింగ్ తీసి, వినియోగదారులకు పంపుతాం. దాదాపు రీచార్జి పద్ధతిలో బిల్లులు చెల్లించాల్సి ఉంటుంది. విద్యుత్ చార్జీలు పెరిగే విషయం, స్మార్ట్ మీటరు ఉచితమా, దాని ఖర్చు వినియోగదారుడే చెల్లించాలా అనే విషయాలపై ఇప్పటి వరకు స్పష్టత లేదు.

– శివకోటిరెడ్డి, ఏఈ, విద్యుత్‌శాఖ

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం


పెదకూరపాడు: మండల పరిధిలోని పెదకూరపాడు, 75 త్యాళ్లూరు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ దాసరిరామకృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ మరమ్మతుల నేపథ్యంలో వినియోగదారులు గమనించి, సహకరించాలని పేర్కొన్నారు.

- **అమరావతి:** మండల పరిధిలోని అమరావతి, మల్లాది విద్యుత్ సబ్ స్టేషన్‌ల పరిధిలోని అన్ని గ్రామాలకు విద్యుత్ సరఫరాను శనివారం నిలిపివేస్తామని విద్యుత్ శాఖ ఏఈ పి.రవికిరణ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.
- **సత్తెనపల్లి(ముప్పాళ్ళ):** పట్టణంలోని విద్యుత్ సబ్ స్టేషన్ మరమ్మత్తుల దృష్ట్యా శనివారం పట్టణంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ ఏఈ కిరణ్ శుక్రవారం తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ ఉండదని పేర్కొన్నారు.
- **అచ్చంపేట:** మండలంలోని అచ్చంపేట, తాళ్లచెరువు, చల్లగరిగ, మాదిపాడు, పెదపాలెం సబ్‌స్టేషన్ పరిధిలోని అన్ని గ్రామాలలో శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ నిలిపివేయడం జరుగుతుందని ఏఈ శివ కోటిరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అబ్బూరు నుంచి 33 కేవీ లైన్ ద్వారా లోడ్ ఎక్కువై తరచూ అంతరాయాలు ఏర్పడుతున్నట్లు పేర్కొన్నారు.దీని నివారణకు కొత్తగా ఊటుకూరు నుంచి మరో 33 కేవీ లైన్ మంజూరైందని తెలిపారు.

ఘనంగా హనుమత్ వ్రతం

యడ్లపాడు: బోయపాలెం జాతీయ రహదారి పక్కనే వేంచేసి ఉన్న శ్రీప్రసన్నాంజనేయస్వామి ఆలయం శుక్రవారం భక్తులతో కళకళలాడింది. ఆలయంలో గురువారం ఉదయం నుంచి శుక్రవారం ఉదయం వరకు 20వ హనుమత్ వ్రతం కొనసాగింది. గ్రామంలోని దంపతులు అధిక సంఖ్యలో పాల్గొని సుదర్శన హోమంలో భాగస్వాములు అయ్యారు. భక్తులకు అన్నదానం చేశారు.

నేడు సాగునీటి సంఘాల ఎన్నికలకు సర్వం సిద్ధం



సాగర్ కాలువ

క్రోసూరు: మండల పరిధిలోని సాగునీటి సంఘాల ఎన్నికలు శనివారం నిర్వహించేందుకు సర్వం సిద్ధం చేసినట్లు ఇన్‌చార్జి తహసీల్దార్ శ్రీనివాస యాదవ్ శుక్రవారం తెలిపారు. క్రోసూరులో పరిధిలోని సాగునీటి సంఘాల ఎన్నికల పోలింగ్ కేంద్రాల వివరాలు వెల్లడించారు. 88 త్యాళ్లూరు డబ్ల్యూఏ(61)కు 12 టీసీలకు 88 త్యాళ్లూరులోని జెడ్పీపాఠశాల, పీసపాడు(62)కు 12 టీసీలకు పీసపాడులోని ఎంపీపీ పాఠశాల, ఉయ్యందన64)–12 టీసీలు, ఎంపీపీ పాఠశాల నార్త్, ఉయ్యందన(65) డైవర్షన్ కెనాల్–12 టీసీలకు ఎంపీపీ పాఠశాల (ఈస్ట్), మిట్టపాలెం(66)–12టీసీలు దొడ్లేరు జెడ్పీ పాఠశాల, క్రోసూరు మైక్ ట్యాంక్ నంబర్–5కు (6టీసీలు) క్రోసూరు జెడ్పీ ఉన్నత పాఠశాల, క్రోసూరు ఇసుకవాగు నంబర్ –6కు (6టీసీలు), ఎర్రబాలెం ఎంపీపీ పాఠశాల, అందుకూరు(116) లిఫ్ట్ ఇరిగేషన్ స్కీం 12టీసీలు– ఎంపీయూపీ పాఠశాల పోలింగ్ కేంద్రాలుగా ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఉదయం 8.30 గంటలకు ఓటింగ్ ప్రారంభమవుతుందన్నారు. మొత్తం ఓటర్లుగా 21,211 మంది ఆయకట్టు రైతులున్నారని తెలిపారు. ఎన్నికల అధికారులుగా నంబర్ 61–88 త్యాళ్లూరుకు బి.శ్రీనివాసరావు ఏఈ, ఎస్ఎస్పీ, సహాయ ఎన్నికల అధికారిగా ఎం.రాజ్‌కుమార్ (వీఆర్వో), నంబర్ 62–పీసపాడుకు ఎన్నికల అధికారిగా జి.శ్రీనివాస్ (ఈవోఆర్డీ), సహాయ ఎన్నికల అధికారి ఎ.రామ చంద్రరావు(వీఆర్వో), నంబర్ 64–ఉయ్యందన ఎన్నికల అధికారిగా వి.మల్లికార్జునరావు(ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ), వై.దామోదరరావు(వీఎస్), నంబర్ 65–ఉయ్యందన(డైవర్షన్ చానల్) ఎస్.రాధారమణ(ఏవో, ఎంపీడీవో): ఎన్.హరి(వీఎస్), మిట్టపాలెం: వీ.వేణుగోపాల్(ఎం.ఏవో) బి.గోపీ నాయక్(వీఎస్), నంబర్ 116 అందుకూరు(ఎస్ఐసీ) సీహెచ్ శ్రీనివాసరావు(డీవై.తహసీల్దార్), సీహెచ్‌కోటయ్య(వీఆర్వో), నంబర్ 5 క్రోసూరు మైక్ ట్యాంక్‌కు ఎం.గణేష్ ఎంఈవో–2, ఎల్.బ్రహ్మనాయడు, నంబర్ 6 క్రోసూరు ఇసుకవాగుకు జీవిసత్యనారాయణ ఎంపీడీవో, షేక్ దావూద్‌ఇబ్రహీం(వీఆర్వో)ను నియమించారు.

సజావుగా నీటి సంఘాల ఎన్నికలు నిర్వహించాలి

అచ్చంపేట: సాగు నీటి వినియోగదారుల సంఘాలకు శనివారం జరిగే ఎన్నికలను సజావుగా, ప్రశాంతంగా నిర్వహించాలని తహసీల్దారు జి.శ్రీనివాసయాదవ్ కోరారు. స్థానిక తహసీల్దారు కార్యాలయంలో శుక్రవారం ఎన్నికల సిబ్బందికి అవగాహన సమావేశం నిర్వహించారు. మండలంలో 10 సాగు నీటి వినియోగదారుల సంఘాలున్నాయన్నాయని తెలిపారు. చామర్రు, చామర్రు ట్యాంక్, వేల్పూరు–1, 2, 3, పెదపాలెం, అంబడిపూడి, చింతపల్లి, చిగురుపాడు, మిట్టపాలెం సంఘాలకు ఎన్నికలు జరుగుతాయన్నారు. ప్రతి సంఘానికి గెజిటెడ్ హోదా కలిగిన అధికారిని ఎన్నికల అధికారిగా, మరొక ఉద్యోగిన సహాయకునిగా నియమించినట్లు చెప్పారు. ఉదయం నామినేషన్ల స్వీకరణ, మధ్యాహ్నం పరిశీలన, 3 గంటల నుంచి ఎన్నికలు జరుగనున్నట్లు చెప్పారు. సొంత భూమి ఉన్న రైతులందరికి ఓటు హక్కు కల్పించినట్లు చెప్పారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు సహకరించవలసినదిగా తహసీల్దారు శ్రీనివాస యాదవ్ కోరారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో, ఇరిగేషన్, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.



ఎన్నికల సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడుతున్న తహసీల్దారు శ్రీనివాసయాదవ్

గోతులు పూడ్చండి..

రాజుపాలెం: మండలంలోని మాచర్ల–గుంటూరు రహదారిలో రాజుపాలెం సమీపంలోని నర్సరీల వద్ద రోడ్డుకు గుంత ఏర్పడింది. అదేవిధంగా రాజుపాలెం–రెడ్డిగూడెం మధ్య అనేక గుంతలతో నిండిపోయింది. ఈ రోడ్డుకు సుమారు నెల క్రితం అదరబాదరగా.. ప్యాచ్ వర్క్‌లు చేశారు. ఎక్కడి గుంతలు అక్కడే వదిలి పనులు పూర్తి చేశారు. ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ రోజు ఇదే రోడ్డుపై తిరుగుతున్నా..గోతుల వ్యవహారం పట్టించుకోవడం లేదు. ఇప్పటికైన సంబంధిత అధికారులు గోతులు పూడ్పించాలని వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు.



నర్సరీల వద్ద రోడ్డుకు గుంత

సత్తా చాటిన డీఆర్‌ఎన్ కళాశాల విద్యార్థులు

చిలకలూరిపేటటౌన్: క్రీడాకారులు ఓటమిని గెలుపునకు సోపానాలుగా మలుచుకున్నప్పుడే భారతదేశ కీర్తిని అంతర్జాతీయస్థాయిలో చాటే అవకాశం ఉంటుందని డీఆర్‌ఎన్‌ఎస్‌సీవీఎస్ కళాశాల అధ్యక్షులు తేళ్ళ సుబ్బారావు చెప్పారు. నెట్‌బాల్ మెన్ టోర్నమెంట్‌లో విజయం సాధించిన కళాశాల విద్యార్థులను అధ్యాపకులు అభినందించారు. ఉత్కంఠ భరితంగా సాగిన ఈ టోర్నమెంట్‌లో యూనివర్సిటీ ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాల విన్నర్స్‌గా నిలిచి ట్రోఫీని చేసుకోగా, రన్నర్స్‌గా డీఆర్‌ఎన్‌ఎస్‌సీవీఎస్ జట్టు విజయం సాధించిందన్నారు. విజేతలను అభినందించిన వారిలో కళాశాల ఉపాధ్యక్షులు డాక్టర్ కందిమళ్ళ సాంబశివరావు, సెక్రటరీ మైలవరపు శివానంద్ కుమార్, ట్రెజరర్ బచ్చు రామలింగేశ్వర రావు, జాయింట్ సెక్రటరీ బేతంచెర్ల రామ కోటేశ్వరరావు అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ సిహెచ్ వెంకన్న రావు పిడి ప్రవీణ్ అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.



ద్వితీయ స్థానంలో నిలిచిన డీఆర్‌ఎన్ కళాశాల విద్యార్థులు

చంద్రాజుపాలెంలో రెవెన్యూ సదస్సు



బెల్లంకొండ: మండలంలోని చంద్రాజుపాలెం గ్రామంలో శుక్రవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పలు రెవెన్యూ సమస్యలపై 5 అర్జీలు వచ్చినట్లు తహసీల్దారు అఫ్రవున్నీసా బేగం తెలిపారు. గ్రామాలలో నిర్వహించే సదస్సుల ద్వారా సమస్యలు త్వరితగతిన పరిష్కారం దక్కుతుందని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు గాదె వెంకటరెడ్డి, ఆర్ఐ పవన్‌కుమార్, దేవదాయ శాఖ అధికారి గాదె రామ కోటిరెడ్డి, నాయకులు ఓర్సు ఆనంద్, వీఆర్వోలు, సర్వేయర్లు పాల్గొన్నారు.

పోలీసు వ్యవస్థపై నమ్మకం కలిగించాలి

సత్తెనపల్లి డీఎస్పీ హనుమంతరావు



పెదకూరపాడు: శాంతి భద్రతల నిర్వహణలో జవాబుదారీగా ఉంటూ పోలీస్ వ్యవస్థపై ప్రజలకు నమ్మకం కలిగించాలని సత్తెనపల్లి డీఎస్పీ హనుమంతరావు అన్నారు. శుక్రవారం పెద్దకూరపాడు పోలీస్ స్టేషన్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. చట్టం దృష్టిలో అందరూ సమానమేనని, ఎవరూ అతీతులు కాదనే విషయాన్ని గుర్తుంచుకోవాలని సిబ్బందికి సూచించారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే వారిని మర్యాదగా పలకరించి, బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరించాలన్నారు. స్టేషన్‌లో పెండింగ్ కేసులు చర్యలు తీసుకోవాలన్నారు. స్టేషన్ పరిధిలోని అన్ని గ్రామాల్లో శాంతియుత వాతావరణాన్ని నెలకొల్పేందుకు తగు చర్యలు చేపట్టాలని కోరారు. సీఐ సురేష్, ఎస్సై గిరి బాబు తదితరులున్నారు.

తాపీ మేస్త్రి అదృశ్యం

నరసరావుపేట రూరల్: పనికి వెళ్లిన తాపీ మేస్త్రీ తిరిగి రాకపోవడంతో అతని కుమారుడు అజయ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు రూరల్ పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు. మండలంలోని ములకలూరు గ్రామానికి చెందిన వినుకొండ నాగేశ్వరరావు తాపీ మేస్త్రీగా పనిచేస్తున్నాడు. ఈనెల 10వ తేదీ పనికోసం ఇంటి నుంచి వెళ్లిన నాగేశ్వరరావు తిరిగి రాలేదు. నాగేశ్వరరావు ఆచూకీ కోసం గాలించినా లభించకపోవడంతో అజయ్ రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కిశోర్ తెలిపారు.

కమ్యూనిటీ స్థలం ఆక్రమణను తొలగించండి

ముప్పాళ్ళ: గ్రామంలో రజకులకు ఇచ్చిన కాలనీలో ఉమ్మడి ప్రయోజనాల కోసం వదిలి పెట్టిన స్థలాన్ని ఆక్రమించుకొని, అడిగితే కేసులు పెట్టి ఇబ్బందులు పెడుతున్నారని, ఆక్రమణను తొలగించాలని గ్రామ మాజీ సర్పంచ్ తొరటి లక్ష్మీ, అమరలింగేశ్వరరావు, మరికొంత మంది రజకులు ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణకు వినతిపత్రం అందజేశారు. గ్రామంలోని రజకులందరూ కలిసి ఒక కమ్యూనిటీ హాలు నిర్మించుకున్నారని, అది పోను మిగిలిన ఖాళీ స్థలాన్ని నీలం రామలింగయ్య, నీలం వెంకటరత్నం అనువారు ఆక్రమించుకొన్నారని వారు ఎమ్మెల్యేకు వివరించారు. ఆక్రమణ దారులకు కాలనీలో రెండు ఇళ్లు కూడా ఉన్నాయని వారు వివరించారు. ఆక్రమణ దారుల నుంచి స్థలాన్ని ఖాళీ చేయించాలని కోరారు. దీనిపై విచారణ జరపాలంటూ ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ తహసీల్దార్ ఎం.భవానిశంకర్‌ను ఆదేశించారు. ముప్పాళ్ళ గ్రామ సచివాలయంలో రెవెన్యూ సదస్సు శుక్రవారం జరిగింది. పాల్గొన్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ గ్రామ సభల ద్వారా రెవెన్యూ సమస్యలను పరిష్కరించుకోవచ్చన్నారు. ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. మాజీ ఎంపీపీ గోగినేని కోటేశ్వరరావు, టీడీపీ నాయకులు బత్తుల నాగేశ్వరరావు, దరువూరి నాగేశ్వరరావు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.



రెవెన్యూ సదస్సులో అర్జీ స్వీకరిస్తున్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

విద్యుత్ బిల్లులు తగలబెట్టారు

అమరావతి: తాము అధికారంలోకి వస్తే కరెంటు చార్జీలు పెంచమని ప్రగల్భాలు పలికి, నేడు ఇష్టారాజ్యంగా విద్యుత్ చార్జీలు పెంచడం సామాన్యుడిపై భారమని సీపీఎం మండల కార్యదర్శి బి.సూరిబాబు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక అంబేడ్కర్ బొమ్మ సెంటర్‌లో సీపీఎం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సూరిబాబు మాట్లాడుతూ పెరిగిన విద్యుత్ చార్జీల కారణంగా రాష్ట్రంలో ఎక్కువ మంది పేద ప్రజల జీవనంపై అధిక భారం పడుతుందన్నారు. ఇప్పటికే నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటి... పేదల బతుకు దుర్భరంగా మారిందన్నారు. ప్రభుత్వం బడా వ్యాపారులకు కొమ్ముకాస్తూ పేదవాడికి ఎటువంటి వెసులుబాటు కల్పించలేక పోయిందని ఆరోపించారు. కార్పొరేట్ సంస్థలకు రాయితీలిస్తూ.. విద్యుత్‌పై యూనిట్‌కు రూ.6 నుంచి రూ.8ల వరకు భారం మోపడం దారుణమన్నారు. విద్యుత్తు స్మార్ట్ మీటర్లు పేదలను అంధకారంలోకి నెట్టే పరిస్థితి ఉందన్నారు. నిరక్షరాస్యులైన పేదలు విద్యుత్ రీచార్జి విధానంతో నష్టపోతారని పేర్కొన్నారు. ఆనాడు ప్రతిపక్ష నాయకుడిగా చంద్రబాబు నాయుడు, ఆయన కుమారుడు లోకేష్ స్మార్ట్ మీటర్లని పెడితే పగలగొట్టండి, తగలబెట్టండని కోర్టులో కేసు వేసిన నానా యాగీ చేసింది వాస్తవం కాదా అని నిలదీశారు. వైఎస్సార్ సీపీ కార్మికవిభాగం నాయకుడు ధారా ప్రసాద్ మాట్లాడుతూ వాగ్దానాలు నేరవేర్చలేక ఘోరంగా ప్రభుత్వం విఫలమైందన్నారు. ప్లే కార్డులతో విద్యుత్ చార్జీలకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ పెరిగిన విద్యుత్ బిల్లులను తగులబెట్టారు. తోకల సూరిబాబు ఎస్కే నాగుల మేర మొహుద్దీన్ వలి, ఎం.సుబ్రహ్మణ్యం, లక్ష్మణ్, మధు పాల్గొన్నారు.



అంబేద్కర్ బొమ్మ వద్ద విద్యుత్ బిల్లులు తగల బెడుతున్న సీపీఎం నాయకులు

రాష్ట్రస్థాయి క్విజ్ పోటీలకు ఉప్పలపాడు విద్యార్థి

నరసరావుపేట రూరల్: రాష్ట్రస్థాయి క్విజ్ పోటీలకు ఉప్పలపాడు జెడ్పీ హైస్కూల్ విద్యార్థి ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కె.శ్రీనివాసరావు శుక్రవారం తెలిపారు. పాఠశాల పదవ తరగతి విద్యార్థి టి.వెంకట కల్యాణ్ ఈనెల 6వ తేదీన భారతీయ విజ్ఞాన్ మండలి నిర్వహించిన జిల్లాస్థాయి క్విజ్ పోటీలలో ద్వితీయస్థానం సాధించినట్లు తెలిపారు. విజయవాడలో ఈనెల 29,30 తేదీలలో విజయవాడలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలలో కల్యాణ్ పాల్గొంటాడని వివరించారు. క్విజ్ పోటీలలో ప్రతిభ కనబర్చిన కల్యాణ్‌ను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కె.శ్రీనివాసరావు, సైన్స్ ఉపాధ్యాయులు ఏపీ మధుకుమార్, జి.సుధాకరరెడ్డి అభినందించారు.



కల్యాణ్‌ను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

మద్యం బెల్ట్ షాపు నిర్వాహకుల అరెస్ట్

క్రోసూరు: క్రోసూరు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ సీఐ టి.తులసి, సిబ్బంది శుక్రవారం అచ్చంపేట మండలం మాదిపాడు గ్రామంలోని సత్తెమ్మ తల్లి గుడి వద్ద దాడులు నిర్వహించారు. మద్యం బెల్ట్‌షాపులు నిర్వహిస్తున్న ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు తెలిపారు. గింజుపల్లి గ్రామానికి చెందిన బాణావత్ వెంకటేశ్వర నాయక్ నుంచి 12 సీసాలు(180 ఎంఎల్), అదే గ్రామానికి చెందిన చీదర నరేష్ నుంచి 20 బాటిళ్ల స్వాధీన పరచుకుని, ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.



నిందితులను అదుపులోకి తీసుకున్న సీఐ తులసి, సిబ్బంది